క్లుప్తంగా

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



గీసుకొండ: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు కోరారు. సోమవారం గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారంలో ఆయన కార్యకర్తలు, నాయకులతో కలి సి ఉపాధ్యాయులను ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గో దారి అశ్విని, డివిజన్ అధ్యక్షుడు జాలిగపు ప్ర సన్న, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నూతన కమిటీ



వర్ధన్నపేట: ఇటీవల ఎన్నికైన వర్ధన్నపేట మునిసిపల్ పట్టణ బీఆర్ఎస్ నూతన కమిటీ సభ్యులు సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హనుమకొండలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎర్రబెల్లిని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, నూతన కమిటీ పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, నాయకులు తుమ్మల యాకయ్య, బానోతు అనిత, శ్రీను, పిట్టల రాజు నూతన కమిటీ సభ్యులు ఎండీ అజీం, రామన్న నర్సయ్య, ఎండీ సోయల్, తిరుపతి సురేష్, శ్రీనివాస్, గోరా, ఎండీ రహీమ్ తదితరులు ఉన్నారు.

సుందర్‌రాజ్ యాదవ్ గెలుపునకు కృషి



నల్లబెల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలు బలపర్చిన అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్ గెలుపు బడుగు బలహీనవర్గాల గెలుపు అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి నీలం సుధాకర్, నాయకులు తంగేళ్ల భాస్కర్, కందుగుల కుమారస్వామి, రాజుసాహెబ్, బాబు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు నేర్పించాలి



సంగెం: విద్యార్థులకు విద్యతో పాటు జీవన నైపుణ్యాల్ని నేర్పించడం అందరి బాధ్యత అని ఉమ్మడి వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ కె.అనితారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాపులకనిపర్తిలోని జెడ్పీఎస్ఎస్‌లో అన్నమనేని మేఘాంష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు అధిగమించడానికి వారికి జీవనపుణ్యాలను నేర్పించాలన్నారు. బాలల పట్ల జరుగుతున్న లైంగిక దాడులను గుర్తించడానికి మెలకువలు నేర్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే 1098, 100, 1930 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్సై పిలిప్‌రాజు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ సిరి ఎన్జీఓ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్, హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు రాజన్న, వెంకటేశ్వర్‌రావు, స్వప్నకుమారి, రవీందర్, రతన్‌సింగ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నం



ఆక్రమణ కోసం చదును చేసిన కాల్వ స్థలం



కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

- కాల్వలను సైతం వదలని కబ్జాదారులు
- టిప్పర్లను అడ్డుకున్న మహిళలు..
- హెచ్చరిక బోర్డు తొలగింపు

ఖానాపురం : ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న స్థలాన్ని సైతం ఆక్రమించుకుంటున్నారు. వరదనీరు వెళ్లడానికి తీసిన కాల్వను సైతం వదలని దుస్థితి నెలకొంటుంది. స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు అటువైపుగా వెళ్లకపోవడంతో స్థలం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఎదురవుతుంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని విక్రయాలు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపురం మండలంలోకి అశోక్‌నగర్‌లో సబ్‌స్టేషన్ వెనకాల ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నంబర్ 226లోని 30 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి కొద్ది రోజులుగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. స్థలంలో మట్టిపోసి చదును చేశారు. ఈ స్థలం డీఫ్లోరైడ్‌కు సమీపంలోనే ఉంది. ప్రాజెక్ట్‌లో ఎక్కువగా నీరు వస్తే బయటకు వెళ్లడానికి కాల్వ ఉంది. రైతు వేదిక పక్కన నుంచి రెండు వైపుల కాల్వల ద్వారా పంట పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. కాగా ఇటీవల కాలంలో కాల్వను, కాల్వ పక్కన ఉన్న స్థలాన్ని సైతం ఆక్రమించుకొని మట్టిపోయించారు. స్థలంతో పాటు కాల్వను ఆక్రమించి శుభ్రంగా తీర్చిదిద్ది ప్లాట్లను సైతం ఏర్పాటు చేసుకొని ఇళ్ల నిర్మాణాలకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడకు వెళ్లి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వచ్చారు. కానీ అధికారులు వచ్చి వెళ్లిన తర్వాత ఆక్రమణదారులు హెచ్చరిక బోర్డులను తొలగించారు. దీంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాజేయడానికి కొంత మంది యత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమించిన స్థలాలను అప్పగించడానికి పలువురి వద్ద నుంచి డబ్బులు సైతం వసూలు చేసినట్లు బాహాటంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్థలం కబ్జా అడ్డగింపు...

ఇళ్ల మధ్యలో నుంచి కాల్వ ఉన్న స్థలాన్ని కబ్జా చేయడానికి కొంతమంది సోమవారం ఉదయం టిప్పర్ల సాయంతో మట్టిపోయడానికి తీసుకొచ్చారు. టిప్పర్‌లో మట్టి పోయించిన తర్వాత మరొక టిప్పర్ ద్వారా మట్టిపోసే క్రమంలో మహిళలు అడ్డుకున్నారు. తమ ఇళ్ల కోసం 15 ఏళ్ల నుంచి స్థలంలో ఉంటుండగా నేడు వచ్చి స్థలాన్ని లాక్కొని కబ్జా చేయడాన్ని ఒప్పుకోని మహిళలు అడ్డుకున్నారు. దీంతో టిప్పర్ ద్వారా తీసుకొచ్చిన మట్టిని రోడ్డుపైనే పోసి వెళ్లిపోయారు. అశోక్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు, విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు సైతం అటువైపుగా కన్నెత్తి చూడకపోవడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్థలంలో ఇప్పటికే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం. హెచ్చరిక ఫ్లెక్సీల తొలగింపు, మట్టి టిప్పర్లను అడ్డుకున్న విషయం తమకు తెలియలేదు.

– రాజారేణుక, ఇన్‌చార్జ్ తహసీల్దార్

ప్రభుత్వాలకు మిర్చి రైతుల ఆవేదన పట్టదా ?

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మిర్చి రైతుల ఆవేదన పట్టదా అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్‌లో రోజు రోజుకు భారీగా పడిపోతున్న మిర్చి ధరను చూసి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. మిర్చిపంటలకు వస్తున్న తెగుళ్లను అరికట్టడానికి రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పంట పండించి మార్కెట్‌కు తీసుకెళ్తే రైతులకు కనీసం గిట్టుబాటు ధర లభించకుండా ఊహించని రీతిలో ధరలు పాతాళంలోకి పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని రైతులకు అండగా ఉంటామని ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు మిర్చి రైతుల విషయంలో చేతులెత్తేసిందని అన్నారు. అంతర్జాతీయ నాణ్యతతో కూడిన మిర్చిని వరంగల్, తెలంగాణ జిల్లాల రైతులు పండిస్తున్నా మార్కెట్‌లో మిర్చికి కనీస మద్దతు ధర రాకపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. మిర్చి పండించిన రైతులు ఎవరు అధైర్యపడొద్దని బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. మిర్చికి మద్దతు ధర వచ్చే విధంగా పోరాటం చేస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకొని మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : మండలంలోని కొండూరు మాజీ ఎంపీటీసీ చిర్ర ఉపేందర్‌రెడ్డి కుమారుడు నితన్ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత

మండలంలోని మైలారం, ఊకల్, కొండూరులో అకాల మరణం పొందిన గాడిపెల్లి సారయ్య, పోలేపాక సుశీల, కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచనల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సౌజన్యంతో నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఫౌండేషన్ ప్రతినిధి లేతా కుల రంగారెడ్డి, కుర్ర రవీందర్‌రెడ్డి, కొమ్ము రాజు, గజవెల్లి ప్రసాద్, యాదగిరిరెడ్డి, సంధి దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, యాకయ్య, భిక్షపతి ఉన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అరికట్టాలి

- ఎంసీపీఐ(యూ)



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

నర్సంపేట : ప్రభుత్వ అసైన్డ్ భూములను దొడ్డిదారిన ఆక్రమించి ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి పేద, మధ్య తరగతి ప్రజలను నమ్మించి అమ్మకాలు, కొనుగోళ్లకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు కన్నం వెంకన్న, గుండెబోయిన చంద్రయ్య, వంగల రాగసుధ డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో సర్వే నంబర్ 111లోని మాధన్నపేట రోడ్డులోని అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా భూమి చదును చేస్తూ క్రయవిక్రయాలకు యత్నిస్తున్న స్థలాన్ని రక్షించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సోమవారం ఆర్డీఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం పేదలు, సేవకులకు జీవనభృతి కోసం ప్రభుత్వ భూములను అసైన్ చేసి ఇస్తే అట్టి భూములను కొంత మంది అనర్హులు దుర్వినియోగం చేస్తూ దళారులకు క్రయవిక్రయాలకు పాల్పడుతూ ప్రభుత్వం ఆశించిన ప్రయోజనాలను తుంగలో తొక్కుతూ 1977 అసైన్డ్ యాక్టును విస్మరిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని, వ్యవసాయం చేయడం కోసం ఇచ్చిన భూమి దశాబ్దాల తరబడి బీడు బడి ఉన్న రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడం అట్టి భూములను స్వాధీన పర్చుకోకపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగమే కబ్జాదారులకు వంత పాడుతున్నట్లు కనబడుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా 111సర్వే నంబర్‌లో చట్టాలను ఉల్లంఘించి ఎలాంటి అనుమతులు లేకుండా భూములను చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పాల్పడుతున్న కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా ఆధ్వర్యంలో ఆ భూమి రక్షణకు పూనుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నాయకులు బైరబోయిన నర్సయ్య, ఎండి.పాషా, అస్గర్, చొప్పరి పద్మ, చింతకింది మనమ్మ, గోనెల అనిత, పెండ్యాల సరిత, సరోజన, పద్మ, సాంబ, అరుణ, సంపూర్ణ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని మిల్లులకు 'సీఎంఆర్' నిలిపివేయాలి

వర్ధన్నపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ పరిధిలోని 23 రైస్ మిల్లులు అనుమతులు లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆ మిల్లు యాజమాన్యాలపై చర్యలు తీసుకుని సీఎంఆర్ నిలిపి వేయాలని కోరుతూ సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ఈరెల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ పరిధిలో మొత్తం 26 రైస్ మిల్లులు ఉన్నాయని ఇందులో కేవలం మూడు రైస్ మిల్లులు మాత్రమే అనుమతులతో వ్యాపారం చేసుకుంటున్నారని, మిగతా 23 అనుమతి లేకుండా ఇటు ప్రభుత్వాన్ని, రైతులను మోసం చేస్తున్నారన్నారు. తన ఫిర్యాదుపై కలెక్టర్ సత్య శారద స్పందించి సంబంధిత అధికారులను ఈ విషయంపై తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించడం జరిగిందన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పర్వతగిరి: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కామన్ పరీక్షల జిల్లా సెక్రటరీ గారె కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యంగా ఉండేందుకు మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం పాక రమేశ్, బాబు, భాస్కర్, పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై కుమార్

గీసుకొండ: విద్యార్థులు గుడుంబా, గంజాయి, గుట్కా, గ్యాంబ్లింగ్ (ఫోర్–జీ)లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని స్థానిక ఎస్సై కే.కుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌రావు అన్నారు. సోమవారం గీసుకొండ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యసనాలకు దూరంగా ఉండాలంటూ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మత్తు పదార్థాలను ఎవరైనా అమ్మితే 8712584473 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాల బారిన పడిన వారు 1939 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా పోలీసు కళా బృందం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, రత్తయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రం రాజు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్'కు మోక్షం

- పెండింగ్ దరఖాస్తులకు 25 శాతం సబ్సిడీ ప్రకటన
- ప్లాట్ల క్రయవిక్రయాలకు మంచి మార్గం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు
- వచ్చే నెల 31 వరకు గడువు



వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం

వర్ధన్నపేట: ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) పెండింగ్ దరఖాస్తులకు ఎట్టకేటకు మోక్షం కలిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అనుమితినిచ్చినప్పటికీ చాలా మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా అక్రమ లేఔట్లలో మిగిలిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో మండలంలో ప్లాట్ల క్రయ విక్రయాలకు మంచి మార్గం ఏర్పడింది. ఈమేరకు ప్రభుత్వం సబ్సిడీ కూడా ప్రకటించింది. గత ప్రభుత్వంలో ఎల్ఆర్ఎస్‌కు చేసుకున్న దరఖాస్తులు మున్సిపాలిటీలో పేరుకుపోయాయి. రూ.వెయ్యి చెల్లించి మున్సిపాలిటీ పరిధిలో 524 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సైతం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దరఖాస్తులు అలాగే వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వడంతో కొంతమంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. అయినా దరఖాస్తులు అలాగే మిగిలిపోయాయి. ఈక్రమంలో స్పందించిన ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానానికి శ్రీకారం చుట్టింది. 25 శాతం రాయితీ ప్రకటించింది. వచ్చే నెల 31 వరకు తగిన రుసుము చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈమేరకు అధికారుల కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు.

ఇది మంచి అవకాశం

ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వడంతోపాటు రాయితీ ప్రకటించడంతో ప్రజలకు ఇది మంచి అవకాశంగా మారనుంది. అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేసుకున్నప్పుడు ఇళ్లు కట్టుకుందామంటే ఇబ్బంది పడే అవకాశం ఉంది. అంతే కాకుండా బ్యాంక్‌లో రుణం పెట్టుకుందామన్న ఎల్ఆర్ఎస్ ఉంటేనే రుణం మంజూరవుతోంది. దరఖాస్తు చేసుకున్న వారు ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. అదే విధంగా మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా.. సుమారు 200 ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. కాగా.. వారికి ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో మాత్రం దరఖాస్తుదారుల నుంచి ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రారంభమైంది.

మున్సిపాలిటీలో 522 దరఖాస్తులు

ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించింది. దరఖాస్తులుదారులు వినియోగించుకోవాలి. దరఖాస్తులు 524 రాగా.. అందులో ఇప్పటి వరకు 10 మందికి ఫీజు ఇంటిమేషన్ ఇచ్చాం. వారు త్వరలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. మిగతా వారు సైతం వచ్చే నెల 31లోగా ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి

– ప్రవీణ్, టీపీఓ, వర్ధన్నపేట మున్సిపల్ ఇన్‌చార్జ్

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- నెక్కొండ విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్



నెక్కొండ: పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు



దుగ్గొండి: మాట్లాడుతున్న డీఈ తిరుపతి



నల్లబెల్లి : మాట్లాడుతున్న ఏఈ హరిబాబు

నెక్కొండ: విద్యుత్ ప్రమాదాల పై రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్ అన్నారు. సోమవారం నెక్కొండ సెక్షన్‌లోని తోపనపల్లి, గొట్లకొండ గ్రామాల్లో అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ ప్రమాదాలపై భద్రతా, జాగ్రత్తలను రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, ఓల్టేజ్ గురించి వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విషయాలపై తగు సూచనలు చేశామన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాల కార్యక్రమం కూడా నిర్వహించామన్నారు. ఇందులో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచునున్నామని పేర్కొన్నారు. హార్వెస్టర్లతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉంటే వాటి స్థానాల్లో 9.1 మీటర్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు.

చెన్నారావుపేట : రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఏఈ జోగానంద్ అన్నారు. సోమవారం అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు.

నల్లబెల్లి : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తామని ఏఈ హరిబాబు అన్నారు. మండలంలోని శనిగరం, అర్వయ్యపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించారు.

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలో సోమవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. రైతుల పంట పొలాలకు వెళ్లి రోజులో ఎన్ని గంటల పాటు కరెంట్ వస్తుంది. ఇబ్బందులు ఉన్నాయా.. ఎన్నిసార్లు ట్రిప్పు అవుతుంది. బావిలో నీటి పరిస్థితి ఏమిటి అనే వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. డీఈ తిరుపతి మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ హెచ్చుతగ్గులు ఉన్నా మోటారు కాలిపోకుండా ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత



బొగ్గుల తండాలో బియ్యం పట్టుకున్న ఎస్సై రాజేశ్‌రెడ్డి

చెన్నారావుపేట : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గురిజాలకు చెందిన గోలి రవీందర్ చుట్టుపక్క గ్రామాల్లో రేషన్ బియ్యంను కొనుగోలు చేసి డంప్ చేస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో సుమారుగా రూ.59,800 విలువ చేసే 23 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు బియ్యంను తరలిస్తున్న ఏపీ 36 టీఏ 1200 నంబర్ గల వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. దాడుల్లో సీఐ ఎస్ రాజు, భాను ప్రకాష్, ఇస్తార్ పాల్గొన్నారు.

బొగ్గుల తండాలో..

మండలంలోని టేకులకుంట తండా గ్రామ శివారు బొగ్గుల తండాలో మాలోతు వాగ్యకు చెందిన రేకుల షెడ్డులో నెక్కొండకు చెందిన మహ్మద్ పాషా రేషన్ బియ్యంను అక్రమంగా నిల్వ చేశాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ.80 వేల విలువ చేసే 32 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యంను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



నెక్కొండ : పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి

నెక్కొండ: ఈనెల 27న నిర్వహించే ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నైపథ్యంలో మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను సోమవారం నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను ఆమె పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఓటర్లు క్యూ పద్ధతి పాటించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్, టాయిలెట్స్ సౌకర్యం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సర్వం సిద్ధంగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో పోలింగ్ కేంద్రం..

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి పరిశీలించారు. ఈనెల 27న జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఓటర్లకు అందించాల్సిన వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఫణికుమార్, సిబ్బంది ఉన్నారు.